82,844 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

- యాసంగి బోనస్ చెల్లింపులపై ఆదేశాలు లేవు
- అదనపు కలెక్టర్

ఖానాపురంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

ఖానాపురం, డిసెంబర్ 18: జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు రూ. 192 కోట్ల విలువైన 82,844 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు అదనపు కలెక్టర్ సంధ్యారాణి తెలిపారు. బుధవారం ఆమె సివిల్ సప్లయ్ డీఎం సంధ్యారాణితో కలిసి ఖానాపురం సబ్ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులు, సొసైటీ సిబ్బందిని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఖానాపురానికి చెందిన రైతు పరుచూరి సుబ్బారావు తాను 1318 సన్నరకం ధాన్యాన్ని పండించానని, సన్నరకం ధాన్యంగా మిల్లర్లు కొనుగోలు చేయడం లేదని అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె క్వాలిటీ కంట్రోలర్ రాజయ్యను వివరణ కోరగా.. సన్నరకం ధాన్యంగా కొనుగోలు చేయొచ్చని తెలిపారు. వెంటనే మిల్లర్‌తో మాట్లాడి ధాన్యం కొనుగోలు చేయించాలని సివిల్ సప్లయ్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా మండలకేంద్రానికి చెందిన శ్రీనివాస రైస్‌మిల్ ధాన్యాన్ని దిగుమతి చేసుకోవడం లేదని సొసైటీ సిబ్బంది చెప్పడంతో ట్యాబ్ నుంచి మిల్లు అలాట్‌మెంట్‌ను తొలగించాలని ఆదేశించారు. యాసంగి సన్నధాన్యానికి బోనస్ చెల్లించే విషయంలో ఎలాంటి ఆదేశాలు అందలేదన్నారు. అనంతరం ఆమె ఖానాపురంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. ఈ నెలాఖరులోగా సర్వే పూర్తి చేయాలన్నారు. తర్వాత కొత్తూరు దుర్గామల్లేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీవో భారతి, ఎంపీవో సునీల్, పాల్గొన్నారు.

'నమస్తే' కథనానికి స్పందన

'అరగంట ఆలస్యమైందని ఔటింగ్ విద్యార్థులను లోపలికి అనుమతించని ప్రిన్సిపాల్' శీర్షికన ఈ నెల 16న నమస్తే తెలంగాణలో కథనం ప్రచురితమైంది. స్పందించిన అదనపు కలెక్టర్ సంధ్యారాణి బుధవారం పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగదిని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. మెనూపై ఆరా తీసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ నెల 15న జరిగిన ఘటనపై ప్రిన్సిపాల్ జయశ్రీని ప్రశ్నించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. ఎవరైనా విద్యార్థులు అనారోగ్యానికి గురైతే వారి తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. తల్లిదండ్రులకు గెస్ట్ రూం ఏర్పాటు చేయాలన్నారు. పిల్లల తల్లిదండ్రులతో తరచూ సమావేశాలు నిర్వహించి మంచి సంబంధాలు కలిగి ఉండాలన్నారు.

ఆర్థిక ప్రగతికి సహకారం అవసరం

ఖిలావరంగల్: జిల్లా ఆర్థిక ప్రగతికి బ్యాంకర్ల సహకారం చాలా అవసరమని అదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో సమీక్షించారు. పంట రుణాలకు రూ. 1802 కోట్లు లక్ష్యంగా పెట్టుకొని ఇప్పటి వరకు సుమారు రూ. 1231 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. వ్యవసాయ రంగంలో ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ. 3,786 కోట్లు లక్ష్యంగా పెట్టుకొని రూ. 2,136 కోట్ల రుణాలు మంజూరు చేశామన్నారు. భారీ చిన్నతరహా పరిశ్రమలకు సుమారు రూ. 998 కోట్లకు రూ. 765 కోట్లు, ప్రాధాన్యతా రంగాల్లో సుమారు రూ. 4,892 కోట్లకు రూ. 3,008 కోట్లు, స్వయం సహాయక సంఘాలకు రూ. 628 కోట్లకు రూ. 492 కోట్లు అందించామని అదనపు కలెక్టర్ అన్నారు.

ఆలయ అభివృద్ధికి ప్రతిపాదనలు చేయాలి

- కాకతీయుల కాలం నాటి ఆలయ అభివృద్ధి కోసం ప్రభుత్వానికి నివేదిస్తాం
- నిధుల మంజూరుకు కృషి చేస్తా
- కలెక్టర్ సత్యశారద

మొగిలిచెర్లలోని ఏకవీర ఎల్లమ్మ అలయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద

గీసుగొండ, డిసెంబర్ 18: కాకతీయుల కాలం నాటి ఏకవీర ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణానికి పురావస్తు, పర్యాటక శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచెర్లలోని కాకతీయుల కాలం నాటి ఏకవీర ఎల్లమ్మ ఆలయాన్ని బుధవారం ఆమె సందర్శించారు. ఆలయం శిథిలావస్థకు చేరడంతో గ్రామస్తులు పలుమార్లు దేవాదాయ శాఖ అధికారులను కలిసి పునర్నిర్మించాలని విన్నవించారు. గతంలో పలుమార్లు పురావస్తు శాఖ అధికారులు ఆలయాన్ని సందర్శించారు. ఈ మేరకు కలెక్టర్ అధికారులతో కలిసి ఆలయానికి వచ్చి చరిత్రను తెలుసుకున్నారు. ఆలయానికి సంబంధించిన పూర్తిస్థాయి నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నట్లు చెప్పారు. సర్కారు నుంచి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆలయానికి వెళ్లే రోడ్లు ఆక్రమణకు గురైందని, రెవెన్యూ అధికారులు ఆలయ భూములను సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని గ్రామసులు కోరగా.. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు.

పట్టు సాగుతో అధిక లాభం

గీసుగొండ మండలం దస్రుతండాలోని పట్టసాగు, షెడ్ నిర్మాణాన్ని కలెక్టర్ పరిశీలించారు. రైతులు ఒకే రకమైన పంటలు సాగు చేస్తే నష్టపోతారని, పట్టు సాగుపై దృష్టి పెట్టాలని, అధిక లాభాలు వస్తాయని రైతులకు సూచించారు. పట్టు పరిశ్రమ వైపు దృష్టి సారిస్తే అన్ని రకాల సలహాలు, సూచనలు ఇచ్చేందుకు వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పురావస్తు శాఖ ఏడీ మల్లనాయక్, జిల్లా పర్యాటక అధికారి శివాజీ, రఘు, తహసీల్దార్ రియాజుద్దీన్, టార్చ్ సంస్థ కార్యదర్శి అరవింద్ ఆర్య, ఎంపీడీవో కృష్ణవేణి, కార్పొరేటర్ మనోహర్, ఆలయ కమిటీ సభ్యులు రమేశ్, భాస్కర్, కుమారస్వామి పాల్గొన్నారు.

లే అవుట్ కమిటీ సమావేశం

ఖిలావరంగల్: జిల్లాలో లే అవుట్ అనుమతుల కోసం కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో లే అవుట్ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలో లే అవుట్ అనుమతుల కోసం ప్రతిపాదనలు రాగా, వాటిపై కమిటీ సమావేశంలో చర్చించి అనుమతి మంజూరు చేసింది.

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎర్రబెల్లి

బాధిత కుటుంబాలకు ఎర్రబెల్లి పరామర్శ

రాయపర్తి, డిసెంబర్ 18: మండలంలోని మైలారం పరిధి అవుసులకుంటతండాకు చెందిన బీఆర్ఎస్ ఎస్టీసెల్ మండల ప్రధాన కార్యదర్శి మాలోత్ వసుందర్‌నాయక్ తండ్రి చంద్యానాయక్, పెర్కవేడుకు చెందిన బొమ్మెర చిన్న వీరస్వామి తండ్రి ఎల్లాగౌడ్ ఇటీవల వివిధ కారణాలతో మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆయా గ్రామాలకు వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించారు. అదేవిధంగా అవుసులకుంట తండాలో అనారోగ్యంతో బాధపడుతున్న హలావత్ రమేశ్‌ను కలిసి ధైర్యం చెప్పారు. ఎర్రబెల్లి వెంట బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బిల్ల సుధీర్‌రెడ్డి, ఆకుల సురేందర్‌రావు, జినుగు అనిమిరెడ్డి, రంగు కుమార్, బొమ్మెర వీరస్వామి, వీరన్న, గుగులోత్ జాజునాయక్, బాషబోయిన సుధాకర్, పాలెపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏవోపై వేటుకు కలెక్టర్ ఆదేశం

వరంగల్ చౌరస్తా, డిసెంబర్ 18: సీకేఎం హాస్పిటల్‌లో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ సాజిద్ అలీపై వేటుకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సూపరింటెండెంట్ డాక్టర్ షర్మిలతోపాటు నోడల్ ఆఫీసర్, డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావును బుధవారం కలెక్టర్ ఆదేశించారు. ఈ నెల 16న దవాఖానను సందర్శించిన కలెక్టర్ అడ్మినిస్ట్రేషన్ విభాగం నిర్లక్ష్యం వల్ల శానిటేషన్ విభాగంతోపాటు ఇతర విభాగాల్లో ఇబ్బందులు తలెత్తుతున్నట్లు గుర్తించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌ను డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు సరెండర్ చేయాలని ఆదేశించారు. సూపరింటెండెంట్ అందుబాటులో లేకపోవడంతో గురువారం సంబంధిత అధికారికి సరెండర్ ఉత్తర్వులు అందించనున్నట్లు డాక్టర్ సాంబశివరావు తెలిపారు.

జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి

కరీమాబాద్, డిసెంబర్ 18: వచ్చే 10వ తరగతి వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించి జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని డీఈవో జ్ఞానేశ్వర్ కోరారు. వడుప్సా డివిజన్ అధ్యక్షుడు బొల్లం కనకయ్య ఆధ్వర్యంలో బుధవారం ఉర్సు బైపాస్ రోడ్డులో 10వ తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదవాలన్నారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు. ఉపాధ్యాయుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. అనంతరం డీఈవోను వడుప్సా నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ట్రస్మా రాష్ట్ర నాయకులు రమేశ్‌రావు, భూపాల్‌రావు, జిల్లా అధ్యక్షుడు నాగార్జున రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి రామ్మూర్తి, వడుప్సా నాయకులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇండ్లల్లో చోరీ

నల్లబెల్లి, డిసెంబర్ 18: తాళం వేసి ఉన్న ఇండ్లల్లో చోరీ చేస్తున్న యువకుడిని గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించిన ఘటన మండలంలో జరిగింది. బాధితుడు రఘుసాల హన్మంతు కథనం ప్రకారం.. హన్మంతు తన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి వ్యవసాయ పనులకు వెళ్లాడు. ఓ యువకుడు సైకిల్‌పై వచ్చి హన్మంతు ఇంటి తాళం పగలగొట్టి చొరబడ్డాడు. అనంతరం బీరువాలోని రూ. 10 వేల నగదును అపహరించి వెళ్తుండగా, గమనించిన గ్రామస్తులు యువకుడిని పట్టుకొని విచారించారు. తనది ఇటుకాలపల్లిగా తెలిపాడు. అనంతరం అతడిని పోలీసులకు అప్పగించారు. మంగళవారం కొండైల్‌పల్లెలో రామగిరి వీరయ్య తన ఇంట్లో రూ. 52 వేల నగదు అపహరణకు గురైనట్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

కుక్కల దాడిలో ఐదు గొర్రెల మృతి

నెక్కొండ, డిసెంబర్ 18: మండలంలోని రెడ్లవాడలో కుక్కల దాడిలో ఐదు గొర్రెలు మృతి చెందాయి. రెండు రోజుల క్రితం మేకల శ్రీనివాస్‌కు చెందిన గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో 15 గొర్రెలు మృతి చెందిన విషయం తెలిసిందే. మంగళవారం రాత్రి మరోసారి బెల్లం వెంకన్నకు చెందిన గొర్రెల మందపై దాడి చేయగా ఐదు గొర్రెలు మృతి చెందాయి. ఈ ఘటనతో సుమారు రూ. లక్ష నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని గొర్రెకాపరులు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

పర్వతగిరి, డిసెంబర్ 18: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఎంఈవో గాయపు లింగారెడ్డి అన్నారు. జడ్పీ, పీఎస్, యూపీఎస్ లెవల్ తెలుగు భాషా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఇలాంటి సమావేశాలతో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు నిబద్ధతతో పని చేయాలని కోరారు. సమావేశంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం పాక రమేశ్‌బాబు, అసిస్టెంట్ సెక్రటరీ ఏ వెంకటరమణారెడ్డి, ఆర్పీలు డాక్టర్ మడత భాస్కర్, ప్రసాద్, కాంప్లెక్స్ టీచర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి నిత్యావసరాల పంపిణీ

రాయపర్తి, డిసెంబర్ 18: మైలారం గ్రామానికి చెందిన మహ్మద్ మదార్ భార్య సైదాబీ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ద్వారా బుధవారం బాధిత కుటుంబానికి 50 కేజీల బియ్యంతోపాటు నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు లేతాకుల రంగారెడ్డి, బిల్ల వెంకట్‌రెడ్డి, రంగు కుమార్, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, లేతాకుల సుధాకర్‌రెడ్డి, అశ్రఫ్‌పాషా, బైరు యాకయ్య, గూడెల్లి వెంకటయ్య, గాడిపల్లి రాములు, ఎల్లస్వామి, కోల సంపత్ పాల్గొన్నారు.

ఖానాపురంలో యూరియా కొరత

ఖానాపురం, డిసెంబర్ 18: మండల పరిధిలోని రైతులు యూరియా కొరతను ఎదుర్కొంటున్నారు. మెట్టపైర్లు, నార్లు పోసుకున్న రైతులకు యూరియా అవసరం కాగా సొసైటీ కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విధిలేని పరిస్థితిలో నర్సంపేటలోని ప్రైవేట్ ఎరువుల దుకాణాలకు వెళ్లి బ్లాక్‌లో కొనుగోలు చేసుకోవాల్సి వస్తున్నదని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి సరిపడా యూరియాను అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.

కొనుగోళ్లను వేగవంతం చేయాలి

ఖానాపురం, డిసెంబర్ 18: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోత్ రామస్వామీనాయక్ సూచించారు. బుధవారం ధర్మారావుపేటలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఇప్పటి వరకు మండలంలో 9 కొనుగోలు కేంద్రాల ద్వారా 22 వేల బస్తాల ధాన్యం కొనుగోలు చేసామన్నారు. త్వరలోనే పూర్తి చేస్తామన్నారు.

అశోక్‌నగర్‌లో వైన్స్ షాపులో చోరీ

ఖానాపురం, డిసెంబర్ 18: అశోక్‌నగర్‌లోని పాకాల వైన్స్ షాపులో బుధవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. అశోక్‌నగర్ శివారులోని పాకాల వైన్స్ షాపును మంగళవారం రాత్రి 10 గంటలకు మూసి ఇంటికి వెళ్లారు. బుధవారం ఉదయం నిర్వాహకులు షాపును తెరిచేందుకు రాగా రేకులు తొలగించి ఉన్నాయి. షాపులోకి వెళ్లి పరిశీలించగా కౌంటర్‌లోని రూ. 37,100 నగదు, ఐదు మద్యం ఫుల్ బాటిళ్లు అపహరణకు గురయ్యాయి. సీసీ కెమెరాల ఫుటేజీని సైతం తీసుకెళ్లారు. యజమాని ఫిర్యాదు మేరకు నర్సంపేట రూరల్ సీఐ సాయిరమణ దర్యాప్తు చేపట్టారు.

'గొల్లకురుమలకు నగదు బదిలీ చేయాలి'

గీసుగొండ, డిసెంబర్ 18: దళారుల ప్రమేయం లేకుండా గొల్లకురుమలకు గొర్రెలకు బదులు రూ. 2 లక్షల నగదు బదిలీ చేయాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నగరబోయిన సారంగం డిమాండ్ చేశారు. బుధవారం వంచనగిరిలో జరిగిన గొర్రెలు, మేకల పెంపకందారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గొల్లకురుమలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ నెల 19న చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు రాజు, శివ, నరేశ్, కట్టయ్య, చరణ్, గణేశ్, సుమన్, రాజ్‌కుమార్, హరీశ్ పాల్గొన్నారు.

చాపలబండలో పశువైద్య శిబిరం

దుగ్గొండి, డిసెంబర్ 18: పాడిపశువుల కోసం ఏర్పాటు చేస్తున్నట్లు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని పశువైద్యాధికారి ఎల్.శారద సూచించారు. బుధవారం మండలంలోని చాపలబండలో గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 126 పశువులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. 33 దూడలకు నట్టల నివారణ మందులు, 8 గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించారు. కార్యక్రమంలో జేవీవో అబ్దుల్ గఫార్, సూపర్‌వైజర్ జహంగీర్, గోపాలమిత్రలు అక్బర్, ప్రసాద్, మధుకర్, లక్ష్మీనారాయణ, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన క్రీడా పోటీలు

కాశీబుగ్గ, డిసెంబర్ 18: వరంగల్ కాశీబుగ్గ ఓసిటీ స్టేడియంలో బుధవారం సీఎం కప్ క్రీడా పోటీలు రెండో రోజు కొనసాగాయి. అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్ పోటీల్లో 300 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు డీఎస్‌డీవో సత్యవాణి తెలిపారు. అథ్లెటిక్స్‌లో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో సుమారు 15 అంశాల్లో పోటీలు నిర్వహించారు. అలాగే, జిమ్నాస్టిక్స్‌లో దాదాపు 20 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. గురువారం నుంచి హనుమకొండలోని జేఎన్ఎస్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు.

ఆదాయపన్ను చెల్లింపుదారులకు మరో అవకాశం

సమావేశంలో మాట్లాడుతున్న ముకాంబికేయన్

వరంగల్‌చౌరస్తా, డిసెంబర్ 18: కేంద్ర ప్రభుత్వ ఆదాయ పన్ను చెల్లింపుల విషయంలో లోటుపాట్లను సరిచేసుకొని వివాద రహిత పన్ను విధానాన్ని అమలు చేయడానికి పన్ను చెల్లింపుదారులకు మరో అవకాశం కల్పిస్తున్నట్లు ఆదాయ పన్నుశాఖ జాయింట్ కమిషనర్ ముకాంబికేయన్ అన్నారు. వరంగల్ స్టేషన్‌రోడ్డులో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పన్ను చెల్లింపు విషయంలో నిర్లక్ష్యానికి పాల్పడిన, కోర్టు కేసుల్లో ఉన్న అంశాలను పరిష్కరించుకోవడానికి ఆదాయ పన్ను శాఖ వినియోగదారులకు వివాద్ సే విశ్వాస్ 2.ఓ స్కీం ఏర్పాటు చేసి మరో అవకాశం కల్పించిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రవికిరణ్, జిల్లా ఆదాయ పన్ను అధికారి మహేందర్, అవినాష్, టాక్స్‌బార్ అధ్యక్షుడు త్రిపురనేని గోపీచంద్, ఐసీఏఐ వరంగల్ చైర్మన్ భగవాన్, చాంబర్ ఆఫ్ కామర్స్ వేద ప్రకాశ్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట సంపత్‌కుమార్, టెక్స్‌టైల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గుండా నమశివాయ, చార్టెడ్ అకౌంటెంట్స్, టాక్స్ ప్రాక్టీషనర్స్, వ్యాపార, వాణిజ్య వేత్తలు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, KARRA PRAVEENA (New Name) Previously called DEEPIKA MUDUGANTI (Old Name), R/o H.No. 1-9-1273/54/1, Sri Rama Rao Colony, Subedari, Hanumakonda Dist., T.G., India and Solemnly declare.
NTW-000

PASSPORT MISSING

I, Kothagattu Mounika D/o Kothagattu Lingaiah, R/o H.No. 1-8-393, Balasamudram, Hanamkonda, Hanumakonda Dist. Warangal. I lost my Passport. Passport No. S7660577 While Travelling in Auto from Adalath Centre to Collectorate Office on my personal work, so if found Please let me know Contact Number:
8106265735

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326503

PLOTS FOR SALE

★80% బ్యాంకు లోన్‌తో వరంగల్ హైవే ఆనుకొని గేటెడ్ కమ్యూనిటీ DTCP అప్రూవ్డ్ ప్లాట్స్, కంప్లీట్ CC రోడ్స్, ఎలక్ట్రిసిటీ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వాటర్ ట్యాంక్‌తో. సంప్ర: 8109994456.
NT-326623

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
అతి తక్కువ ఖర్చు
అత్యధిక ప్రచారం

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

పోలీసులతో కలిసి సీపీ నైట్ పెట్రోలింగ్

వరంగల్‌లో నైట్ పెట్రోలింగ్ చేస్తున్న సీపీ

సుబేదారి, డిసెంబర్ 18 : వరంగల్ నగరంలో పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా మంగళవారం నైట్ పెట్రోలింగ్ చేశారు. రంగంపేట, మ్యూజికల్ పార్కు, చార్‌బౌళి, పాఠక్ మహల్ ప్రాంతాల్లో పోలీసు అధికారులతో కలిసి పర్యటించారు.

వరంగల్‌లో బీహార్ యువకుడి హత్య

- బార్ వద్ద గొడవ..
- ఇంటికి వచ్చి ఇనుప పైపుతో కొట్టి చంపిన యువకులు

వివరాలు సేకరిస్తున్న ఏసీపీ

కరీమాబాద్, డిసెంబర్ 18: పొట్టకూటి కోసం బీహార్ నుంచి వచ్చిన ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. బుధవారం ఉదయం రక్తపు మడుగులో విగతజీవిగా కనిపించాడు. ఈ హృదయవిదారక ఘటన వరంగల్ నగరంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని ఎస్ఆర్ఆర్‌తోటలో బీహార్‌కు చెందిన దిల్‌ఖుష్ కుమార్(18) కొంతకాలంగా తన సోదరుడితో కలిసి నివాసముంటున్నాడు. ఇదే ప్రాంతానికి చెందిన నగేశ్‌తో పాటు కొంతమంది యువకులతో అతడికి మంగళవారం బార్ వద్ద గొడవ జరిగింది. దీంతో దిల్‌ఖుష్ కుమార్ తన సోదరుడితో కలిసి ఇంటికి వచ్చి నిద్రించారు. ఇంటికి వచ్చిన యువకులు మళ్లీ వారితో గొడవ పడ్డారు. మాటామాట పెరగడంతో ఇనుప పైపుతో దిల్‌ఖుష్‌కుమార్ తలపై నగేశ్ బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మరణించాడు. విషయం తెలుసుకున్న వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, మిల్స్‌కాలనీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కాగా, మద్యం మత్తులో యువకులు ఈ హత్య చేసినట్లు సమాచారం. ఈ మేరకు స్థానికులు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. యువకుడి హత్య విషయం తెలుసుకున్న స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించాలి

నెక్కొండ: అలంకానిపేట పీహెచ్‌సీని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో సాంబశివరావు

నెక్కొండ, డిసెంబర్ 18: వైద్య ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు సూచించారు. నెక్కొండ, అలంకానిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. వ్యాక్సినేషన్‌తోపాటు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. వైద్య సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలన్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రకాశ్, వైద్యాధికారులు అర్చన, రహేలా తన్వీర్, సుమన్, ,మౌనిక, రాహుల్, డీఈఎంవో అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పోషకాహారంతో టీబీ నియంత్రణ

గిర్మాజీపేట/వరంగల్‌చౌరస్తా/సంగెం, డిసెంబర్ 18: పోషకాహారం తీసుకోవడం వల్ల టీబీని నియంత్రించొచ్చని డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు అన్నారు. జాతీయ క్షయనివారణ కార్యక్రమంలో భాగంగా క్షయ నివారణ సంస్థ ఆధ్వర్యంలో పని చేస్తున్న ఉద్యోగులు తమ సొంత నిధులతో వ్యాధిగ్రస్తుల కోసం సమకూర్చిన పోషకాహార కిట్లను బుధవారం డీఎంహెచ్‌వో చేతులమీదుగా అందించారు. ఈ సందర్భంగా ఉద్యోగులను అభినందించారు. కార్యక్రమంలో సిబ్బంది ప్రభాకర్, రంజిత్, వేణుగోపాల్, నరేశ్, మాధవి, సుభాషిని, సంకీర్తన, నరేశ్, అశోక్ పాల్గొన్నారు. సంగెం మండలం కాపులకనపర్తి, గవిచర్ల పల్లె దవాఖానలను డీఎంహెచ్‌వో తనిఖీ చేశారు. వైద్య సేవలు, సమయపాలనపై ఆరా తీసి రికార్డులను పరిశీలించారు. చలికాలంలో పిల్లలు, వృద్ధులు ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ధరలకనుగుణంగా కూలి రేట్లు పెంచాలి

బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజ్

యాజమాన్యాలకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నర్సంపేట, డిసెంబర్ 18: నిత్యావసర ధరలకు అనుగుణంగా హమాలీల కూలి రేట్లు పెంచాలని బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజ్ డిమాండ్ చేశారు. పట్టణ మార్కెట్ ఖరీదు, ఫర్టిలైజర్ యూనియన్, ఐరన్ అండ్ మర్చంట్ యూనియన్ అధ్యక్షులు వంగేటి గోవర్ధన్, దోమకుంట్ల సురేశ్, బూర అశోక్‌కు బుధవారం వేర్వేరుగా బీఆర్టీయూ, ఏఐటీయూసీ కార్మిక సంఘాల అనుబంధ హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా యువరాజ్, హమాలీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కొల్లూరి లక్ష్మీనారాయణ, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు గుంపెల్లి మునీశ్వర్ మాట్లాడుతూ రెండేళ్లకోసారి నూతన రేట్ల ఒప్పందం ఉంటుందన్నారు. ఈ నెల 21లో గడువు ముగుస్తుందని, నూతన రేట్లు అగ్రిమెంట్ చేసుకోవడానికి కార్మిక సంఘాలతో చర్చలు జరపాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గుండెబోయిన కొమురయ్య, ఎడ్ల నాగులు, యార చంద్రమౌళి, వడిచెర్ల శ్రీనివాస్, గాండ్ల రాములు, రమేశ్, ఏలేందర్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గిర్మాజీపేట, డిసెంబర్ 18: ఇందిరమ్మ మహిళాశక్తి పథకం ద్వారా టీజీఎంటీసీ, ప్రభుత్వ గుర్తింపు పొందిన శిక్షణా సంస్థల్లో టైలరింగ్ నేర్చుకున్న మహిళా అభ్యర్థులకు ప్రభుత్వం అందించే ఉచిత గృహ కుట్టు మిషన్లు పొందడానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి టీ రమేశ్ తెలిపారు. మహిళా అభ్యర్థులు tgobmms.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకొని పత్రాలను 31లోగా అందించాలన్నారు.

మెడికల్ కళాశాల ఆఫీస్ సూపరింటెండెంట్‌గా మొయిజ్

నర్సంపేట, డిసెంబర్ 18: ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఆఫీస్ సూపరింటెండెంట్‌గా ఎండీ మొయిజ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కళాశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న మొయిజ్ ఉద్యోగోన్నతిపై నర్సంపేటకు వచ్చారు. అనంతరం ఆయన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దివ్వెల మోహన్‌దాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

వైద్య విద్యార్థికి ఆర్థిక సాయం

వరంగల్‌చౌరస్తా, డిసెంబర్ 18: ఆర్థిక సమస్యలతో విద్యాభ్యాసాన్ని నిలిపివేసే స్థితిలో ఉన్న వైద్య విద్యార్థికి జూనియర్ డాక్టర్లు ఆర్థిక సాయం అందజేశారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం గాలివారిగూడేనికి చెందిన బానోత్ సందీప్ 2022లో నిర్వహించిన నీట్‌లో అర్హత సాధించి ప్రతిమ రిలీఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో సీటు సాధించాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ద్వితీయ సంవత్సరం విద్యాభ్యాసం చేయలేని పరిస్థితిలో ఉన్నాడు. విషయం తెలుసుకున్న జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తమవంతు సాయంగా దాతల నుంచి సేకరించిన లక్ష రూపాయలను కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి చేతుల మీదుగా సందీప్‌కు అందజేశారు. తోటి విద్యార్థికి చేయూతనిచ్చిన జూనియర్ డాక్టర్లను ప్రిన్సిపాల్ అభినందించారు.

ఇటలీ అమ్మాయి.. వరంగల్ అబ్బాయి

పెద్దల సమక్షంలో ప్రేమ వివాహం

సూర్య ప్రీతం, మార్తపెట

పోచమ్మమైదాన్, డిసెంబర్ 18: ఖండాలు, దేశాలు వేరైనా ప్రేమబంధం ఇద్దరిని ఏకం చేసింది. వివరాల్లోకి వెళ్తే.. వరంగల్ దేశాయిపేట ఒయాసిస్ కాలనీకి చెందిన కోడిపాక సదానందం–ప్రసన్నరాణి దంపతుల కుమారుడు సూర్య ప్రీతం ఉన్నత విద్యాభ్యాసం కోసం ఐదేళ్ల క్రితం లండన్‌కు వెళ్లి అక్కడే స్థిపడ్డాడు. అక్కడే ఉంటున్న ఇటలీ దేశానికి చెందిన జెన్నిపేటలో–మోనికపెటలో దంపతుల కుమార్తె మార్త పెటతో అతడు ప్రేమలో పడ్డాడు. దేశాలు వేరైనప్పటికీ పెద్దలను ఒప్పించారు. ఈ నేపథ్యంలో వారు ఇండియా సంప్రదాయం ప్రకారం పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. బుధవారం వారు దేశాయిపేటలోని సీఎస్ఐ చర్చిలో ఇరు కుటుంబాల మధ్య ఒక్కటయ్యారు.

వైద్యం చేయిస్తానంటూ బురిడీ

వరంగల్‌చౌరస్తా, డిసెంబర్ 18: వైద్యం చేయిస్తానని నమ్మబలికిన ఓ వ్యక్తి వృద్ధురాలి వద్ద ఉన్న నగదుతో ఉడాయించిన ఘటన ఎంజీఎంహెచ్‌లో జరిగింది. వైద్యాధికారుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం నాంచారిమడుగు గ్రామానికి చెందిన బాతోజు విమల(65) బుధవారం వైద్య సేవల కోసం ఎంజీఎం దవాఖాన ఓపీ విభాగం వద్దకు వచ్చింది. ఆమెను గమనించిన గుర్తుతెలియని వ్యక్తి తనకు వైద్యుడితో పరిచయం ఉందని, రూ. వెయ్యి ఇస్తే వైద్యంతోపాటు మందులు ఇప్పిస్తానని నమ్మబలికాడు. వృద్ధురాలి వద్ద ఉన్న నగదును తీసుకొని పరారయ్యాడు. బాధితురాలు వైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఔట్‌పోస్టు పోలీసులతోపాటు మట్టెవాడ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీసీ ఫుటేజీ ఆధారంగా విచారణ చేపట్టారు.

ఎంజీఎంహెచ్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి

వరంగల్‌చౌరస్తా, డిసెంబర్ 18: ఎంజీఎం దవాఖానలో చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి బుధవారం ఉదయం మృతి చెందాడు. వైద్యాధికారులు, మట్టెవాడ పోలీసుల కథనం ప్రకారం.. మంగళవారం ఓపీ సేవల కోసం ఎంజీఎంహెచ్‌కు వచ్చిన వ్యక్తి ఆవరణలో స్పృహ కోల్పోవడంతో సిబ్బంది అత్యవసర విభాగంలో చేర్పించారు. చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు.

వల్లెం శ్రీనివాస్‌కు జాతీయ అవార్డు

గీసుగొండ, డిసెంబర్ 18: వరంగల్ 16వ డివిజన్ ధర్మారానికి చెందిన వల్లెం శ్రీనివాస్ జాతీయ సేవారత్న అవార్డు అందుకున్నారు. న్యూఢిల్లీలో జరిగిన 17వ అంతర్జాతీయ బహుజన సాహిత్య వేడుకల్లో వల్లెం శ్రీనివాస్ సేవారత్న ఫౌండర్ నల్లల రాధాకృష్ణ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. శ్రీనివాస్ చేస్తున్న సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ అవార్డు అందించినట్లు రాధాకృష్ణ తెలిపారు.

బాధితులకు సత్వర న్యాయం చేయాలి

నర్సంపేట, డిసెంబర్ 18: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం చేయాలని నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం ఆయన పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పరిసరాలు, పోలీస్ సిబ్బంది కిట్లు, రికార్డులను తనిఖీ చేశారు. పోలీసులు ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నర్సంపేట టౌన్ సీఐ రమణమూర్తి, ఎస్సైలు రవికుమార్, అరుణ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.